# సకల కుల బాంధవుడు సీఎం కేసీఆర్

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్
- 'ఖని'లో యాదవ, బెస్త కుల సంఘాల భవనాలకు భూమిపూజ

కోల్‌సిటీ, అక్టోబర్ 7: స్వరాష్ట్రంలో ఏ కుల సంఘంను కూడా తక్కువ చూడకుండా అన్ని కుల సంఘాలను సమానంగా చూస్తున్న సకల కుల బాంధవుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఈమేరకు రూ.40లక్షల నిధులతో రామగుండం నగర పాలక సంస్థ 31వ డివిజన్‌లో యాదవ సంఘం భవనం, 44వ డివిజన్‌లో బెస్త కుల సంఘం భవన నిర్మాణాలకు శనివారం సాయంత్రం భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని కులాలకు సమాన ప్రాతినిథ్యం లభిస్తుందన్నారు. కుల సంఘాల ఆత్మగౌరవం ఏమాత్రం తగ్గకుండా అందరి సంక్షేమానికి పాటు పడుతున్నారన్నారు. కుల వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి ఆర్థికంగా భరోసా కల్పిస్తున్నారన్నారు. తెలంగాణలో మత్స్య సంపద ఎంత అభివృద్ధి చెందిందంటే, నాడు ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడకు చేపలు దిగుమతి చేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఇప్పుడు మత్స్య సంపద పెరిగి ఇతర రాష్ట్రాలకు మనం ఎగుమతి చేసే రోజులు తీసుకవచ్చారని పేర్కొన్నారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నగర పాలక మేయర్ అనిల్‌కుమార్, కార్పొరేటర్లు అడ్డాల స్వరూపారామస్వామి, నాయకులు సత్యం, నీరటి శ్రీనివాస్, చెల్కలపల్లి శ్రీనివాస్, మెండె లింగయ్య, పాతపెల్లి రవి, రాజయ్య, పారుపెల్లి రాజలింగు, గుంపుల ఓదెలు, రమ్య యాదవ్ పాల్గొన్నారు.



గోదావరిఖని: అడ్డగుంటపల్లిలో ఆరె కటిక సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

### ఆరె కటిక సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

గోదావరిఖని, అక్టోబర్ 7: స్థానిక 38వ డివిజన్ అడ్డగుంటపల్లిలో గల ఆరె కటిక సంఘం భవన నిర్మాణాన్ని సంఘం అధ్యక్షుడు గౌలికార్ రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోరుకంటి చందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆరె కటిక కులస్తులకు రూ.10 లక్షలు మంజూరు చేసి, భవనానికి భూమిపూజ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మరో రూ.10లక్షలు కూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆరె కటిక కులస్తులకు ఎలాంటి సమస్య ఉన్న నేను ముందుండి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. రాబోయే కాలంలో మరింత అభివృద్ధి పనులను నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ గడ్డి సరోజని, రాజ్‌కుమార్, ఆరె కటిక సంఘం ప్రధాన కార్యదర్శి గజ భీంకార్ నర్సోజీ, చందు, కిరణ్, అనిల్, శ్రీనివాస్, సతీశ్, శివాజీ, నరేశ్, శంకర్, నందు, మహేశ్ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సింగిల్ విండో గేట్‌పాస్ సిస్టమ్ అమలు

జ్యోతినగర్, అక్టోబర్ 7: ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల గేట్‌పాస్ జారీలో యాజమాన్యం సింగిల్ విండో గేట్‌పాస్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ మేరకు శనివారం ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానలో గేట్ పాస్‌ల జారీకి ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిని ఎన్టీపీసీ సీజీఎం కేదార్ రంజన్ పాండు ప్రారంభించారు. ఇక నుంచి ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల గేట్ పాస్ జారీకి కావాల్సిన హెచ్‌ఆర్, సేఫ్టీ, మెడికల్, సీఐఎస్‌ఎఫ్ విభాగాల పనులు ఒకే చోట లభించనున్నాయి.

## ఓబీ ఉత్పత్తిపై డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 7: సింగరేణి సంస్థ డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు) జీ. వెంకటేశ్వర్‌రెడ్డి ఓబీ ఉత్పత్తిపై శనివారం హైదరాబాద్‌లోని కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీలో గుత్తేదారులకు కేటాయించిన ఓబీ తొలగింపుపై ఆయా జీఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుత్తేదారులకు కేటాయించిన ఓబీ లక్ష్యాలు సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓబీ మెటీరియల్ అందుబాటులో ఉండే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. యంత్రాలను పూర్తిగా వినియోగించుకోవాలని ఏరియా అధికారులను ఆదేశించారు. ఆర్జీ-2 ఏరియాలో గత మాసంలో వర్షాల వల్ల కేటాయించిన ఓబీ తొలగింపునకు అంతరాయం ఏర్పడిందన్నారు. రాబోయే రోజుల్లో లక్ష్యాలకు అనుగుణంగా గుత్తేదారులకు కేటాయించిన ఓబీ తొలగించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని జీఎం సూర్యనారాయణ డైరెక్టర్‌కు తెలిపారు. ఈ వీసీలో ఓసీపీ-3 అధికారి మధుసూదన్, సర్వే అధికారి నర్సింగరావు పాల్గొన్నారు.

## ఆర్జీ-3లో ప్రాంతీయ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఓటూ జీఎంలు

రామగిరి, అక్టోబర్ 7: సింగరేణి ఆర్జీ-3 ఏరియాలో ప్రాంతీయ స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు స్థానిక ఆర్‌ఆర్‌డీ స్టేడియంలో శనివారం నుంచి డబ్ల్యూపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎస్‌వోటూ జీఎంలు, బైద్య, రఘుపతి హాజరై ప్రారంభించి మాట్లాడారు. కోలిండియా స్థాయిలో సింగరేణి సంస్థ పేరు నిలబెట్టాలని సూచించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి కంపెనీ స్థాయికి పంపిస్తామన్నారు. ఈ పోటీల్లో ఆర్జీ-3, ఏపీఏ, భూపాలపల్లి జట్ల క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైపీఎం మారుతి, సీనియర్ పీవో రాజేశం, ఎస్‌వో లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## రామగుండంలో గద్దర్ యాది సభ



రామగుండం జెన్‌కో మైదానం సభలో కళాకారుల ఆటపాట

జ్యోతినగర్(రామగుండం), అక్టోబర్ 7: రామగుండం జెన్‌కో మైదానంలో శనివారం రాత్రి ప్రజాయుద్ధనౌక స్వర్గీయ గద్దర్ యాది సభ జరిగింది. వక్తలు గద్దర్ ప్రజా జీవిత యాదిని స్మరించుకున్నారు. కళాకారులు గద్దర్ పాటలతో అలరింపజేశారు. ప్రొఫెసర్ కాశీం, గద్దరు కూతురు డాక్టర్ వెన్నెల ముఖ్యఅతిథులుగా పాల్గొన్న ఈ సభకు అతిథులుగా బీఆర్‌ఎస్ నేత కౌశికహరి, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లవజ్జల వంశీ, విద్యావంతుల వేదిక నాయకులు మల్లవజ్జల విజయానందు పాల్గొన్నారు. మున్సిపల్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు కోల లక్ష్మణ్, కార్యక్రమం నిర్వాహకులు కాసర్ల మల్లేశ్, కన్వీనర్ నిమ్మరాజుల రవి, కళాకారులు జీడి సారయ్య, గంగారపు వెంకటేశ్, గద్దన, జనగామ రాజనర్సు, రైతు సంఘం నాయకుడు ముడిమడుగుల మల్లయ్య, పుట్ట రాజన్న, ఉమామహేశ్వర్ ఉన్నారు.

## ఇందారపు సునీతకు అబ్దుల్ కలాం పురస్కారం

కోల్‌సిటీ, అక్టోబర్ 7: గోదావరిఖనికి చెందిన మన చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఇందారపు సునీతను అబ్దుల్ కలాం పురస్కారం వరించింది. పారిశ్రామిక ప్రాంతంలో చేయూత సంస్థ ద్వారా చేస్తున్న సేవలను గుర్తించి స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా (హైదరాబాద్) సంస్థ ఇంటర్నేషనల్ హానరీ 2023 డాక్టర్ అబ్దుల్ కలాం అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా, పీస్ ఆఫ్ ఇండియా, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్జీవో చైర్మన్ ఆకుల రమేశ్, ప్రధాన కార్యదర్శి ఇమ్మిశెట్టి రవీందర్, పీస్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డా.లయన్ గట్టుపల్లి శ్రీనివాస్ సునీతకు అవార్డును ప్రదానం చేశారు.

# రెండు రోజుల పాటు 52వ జోనల్ రెస్క్యూ పోటీలు

- పాల్గొననున్న ఆరు రెస్క్యూ జట్లు
- వివరాలు వెల్లడించిన జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

యైటింక్లయిన్ కాలనీ, అక్టోబర్ 7: సింగరేణి సంస్థ 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలకు ఆర్జీ-2 ఏరియాలోని మెయిన్ రెస్క్యూ స్టేషన్‌ను సిద్ధం చేసినట్లు ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ పేర్కొన్నారు. శనివారం రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లుతో కలిసి రెస్క్యూ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 10,11 తేదీల్లో పోటీలు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల ప్రారంభోత్సవానికి సంస్థ డైరెక్టర్స్ జీ. వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్. బలరాం, ఎన్‌వీకే శ్రీనివాస్, డీఎంఎస్ అధికారులు హాజరవుతారన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించనున్న ఈ పోటీలకు అదే స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి రెస్క్యూకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని గుర్తు చేశారు. సంస్థ రెస్క్యూను బలోపేతం చేయడంలో భాగంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన పనిముట్లను అందుబాటులో ఉంచుతూ టీం సభ్యులకు అత్యున్నతమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో సింగరేణి వ్యాప్తంగా ఆరు జట్లు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నట్లు వెల్లడించారు. ఫస్ట్ ఎయిడ్, థియరీ, రెస్క్యూ, రెస్క్యూ రికవరీ అంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిసారిగా గనిలో ప్రమాదం జరిగినప్పుడు రెస్క్యూ సభ్యులు చేపట్టే ఆపరేషన్ 7ఎల్ ఈపీ గనిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

### పోటీల్లో పాల్గొనే జట్లు

ఆర్జీ-1, ఆర్జీ-2,3, ఏపీఏ, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, కొత్తగూడెం రీజియన్ బృందాలు పాల్గొని తమ ప్రతిభను చాటనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్జీ రీజియన్ రక్షణ జీఎం సందనాల సాంబయ్య, రెస్క్యూ మేనేజర్ బింగి మాధవరావు, డీజీఎం(ప) రాజేంద్రప్రసాద్, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కమిటీ ఎన్నిక

గోదావరిఖని, అక్టోబర్ 7: బీఆర్‌ఎస్ పార్టీ రామగుండం నియోజకవర్గ లీగల్ సెల్ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మేడ చక్రపాణి, ఉపాధ్యక్షులుగా రాకం దామోదర్, కొప్పుల నరేశ్‌కుమార్, కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా చెల్కల పద్మజ, కాంపెల్లి చంద్రశేఖర్, శ్రీనివాస్, బాస అనురాధ, దుండె మల్లేశ్, సత్యనారాయణ, కోశాధికారిగా పులిపాక ప్రవీణ్, చీఫ్ ఆర్గనైజర్‌గా వేణు, ఆర్గనైజర్లుగా దేశెట్టి అంజయ్య, వేల్పుల అరుణ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, ముప్పుర్తి కుమార్, చీఫ్ కో-ఆర్డినేటర్‌గా ప్రదీప్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే చందర్ ప్రకటించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 7: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాల సంఖ్య సైతం పెరుగుతోందని, సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని ఆదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ పీ శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం మార్కండయకాలనీలోని చైతన్య డిగ్రీ కళాశాలలో జరిగిన మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తర భారత్‌కు చెందిన కొంతమంది సైబర్ నేరగాళ్లు ఆధార్‌కార్డు అప్‌డేట్, చిరునామా మార్పు, ఇతర అంశాలపై అమాయకులకు వలవేసి ఓటీపీల పేరుతో బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులను తీసుకుంటున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇక్కడ లోక్ అదాలత్ సభ్యులు మేడ చక్రపాణి, శంకర్, న్యాయవాదులు కొమురెల్లి, వరలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంతం, విద్యార్థులు ఉన్నారు.

## నేటి ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

జ్యోతినగర్(రామగుండం), అక్టోబర్ 7: రామగుండం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1986-87లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రామగుండం జెన్‌కో ఫీల్డ్ హాస్టల్‌లో నిర్వహిస్తున్నట్లు, అందరూ తరలిరావాలని పూర్వ విద్యార్థులు అబ్దుల్ తఖీ, ముక్కెర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం రామగుండంలో వారు మాట్లాడారు. ముందు ముందు చేపట్టనున్న పలు సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తామన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఎన్నికలు

గోదావరిఖని, అక్టోబర్ 7: కార్మిక సంఘాల చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఎన్నికలు ఉండాలని జీవీఎల్‌కేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.విశ్వనాథ్ అన్నారు. కార్మిక సంఘాల మనుగడ లేకుండా చేసేందుకు, కార్మిక సంఘ చట్టబద్ధ హక్కులను హరించి వేస్తూ, బావులను ప్రైవేటీకరణ చేస్తున్న ప్రభుత్వం, యాజమాన్యాలను ప్రాతినిధ్య సంఘాలు అడ్డుకోలేకపోతున్నాయని వాపోయారు. హైదరాబాద్‌లోని ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో శనివారం అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సునీల్ కుమార్‌కు నామినేషన్ పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కే.విశ్వనాథ్ మాట్లాడారు. 1998లో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు రెండేళ్ల కాలపరిమితితో వచ్చేవి అన్నారు. కానీ దాన్ని నాలుగేండ్లకు ఇష్టారాజ్యంగా చేస్తూ ఇప్పుడు ఆరేండ్ల కాలం గడిపారన్నారు. యాజమాన్యం తమ అవసరాల కోసం ఎన్నికల కాల పరిమితిని పెంచి వేస్తున్నారని వాపోయారు. గెలిచిన కార్మిక సంఘాలు మిగిలిన కార్మిక సంఘాల మనుగడ లేకుండా చేసేందుకు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి ఎన్నికల షెడ్యూల్‌కు ముందే కోడ్ ఆఫ్ ఇసిప్లెయిన్ ప్రజాస్వామికమైన పద్ధతుల్లో మార్చాలని కోరినట్లు తెలిపారు. యాజమాన్యం కార్మిక శాఖ మెజార్టీ సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. గత నెల 30న ఇవ్వాల్సిన డ్రాఫ్టు, ఓటరు లిస్టు ఇవ్వలేదని, కార్మిక సంఘాల అభిప్రాయాలను తీసుకోలేదన్నారు. ఈ నెల 3న ఇవ్వాల్సిన ఫైనల్ ఓటరు జాబితాను అర్హత కలిగిన కార్మిక సంఘాలకు ఇవ్వకుండానే నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేయడాన్ని అప్రజాస్వామికమన్నారు.

### నామినేషన్ దాఖలు చేసిన టీబీజీకేఎస్

గోదావరిఖని, అక్టోబర్ 7: సింగరేణి సంస్థలో ఇటీవల విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించి శనివారం టీబీజీకేఎస్ నామినేషన్ దాఖలు చేసింది ఎన్నికలు వాయిదా వేయాలని సింగరేణి సంస్థలోని 12 కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నా అవేమీ పట్టించుకోకుండా డిప్యూటీ లేబర్ కమిషనర్ జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారంగా ముందుకు వెళ్తుండడంతో ఆ మేరకు ఎన్నికల నామినేషన్లకు శనివారం చివరి రోజు కావడంతో టీబీజీకేఎస్ నుంచి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య పాల్గొన్నారు.